నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

- అధిష్ఠానంతో భేటీ అయ్యే అవకాశం
- సీఎం అయ్యాక 27వ సారి పయనం

హైదరాబాద్, నవంబర్ 24(నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం మళ్లీ ఢిల్లీకి వెళ్లనున్నారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కుటుంబం నిర్వహించే ఓ ఫంక్షన్‌లో ఆయన పాల్గొనున్నారు. అనంతరం కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలతో భేటీ అయ్యే అవకాశం ఉన్నది. ఈ భేటీలో రాష్ట్రంలో నామినేటెడ్ పోస్టుల భర్తీతో పాటు కులగణన అంశంపై చర్చించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. దీంతో పాటు మంత్రివర్గ విస్తరణపైనా ఆయన చర్చించనున్నారని సమాచారం. ఆయా అంశాలపై నెల క్రితమే నిర్ణయం తీసుకోవాల్సి ఉండగా, మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల నేపథ్యంలో అధిష్ఠానం పెద్దలు వాయిదా వేశారు. ఇప్పుడు ఎన్నికల ప్రక్రియ ముగియడంతో రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించే అవకాశం ఉన్నది. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్లడం ఇది 27వసారి కావడం గమనార్హం. సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రతినెల సగటున రెండు సార్లు ఢిల్లీ బాటపడుతున్నారు.

రేపు రాజ్యాంగ దినోత్సవం

హైదరాబాద్, నవంబర్ 24(నమస్తేతెలంగాణ): రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 26న రాజ్యాంగ దినోత్సవం, ప్రజాపాలనా విజయోత్సవాల్లో భాగంగా పనుల జాతరను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ జీ శ్రీజన ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం ఉదయం 11గంటలకు గ్రామసభల్లో రాజ్యాంగ ప్రవేశిక చదివేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల జాతరలో భాగంగా ఉపాధిహామీ పథకం కింద రూ.2750 కోట్లతో పంచాయతీల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

రాజకీయ అవినీతికి పరాకాష్ట అదానీ స్కాం

- అదానీని శిక్షిస్తే మోదీ ప్రభుత్వం పడిపోవడం ఖాయం
- అదానీ వ్యవహారంతో దేశ రాజకీయాల్లో ప్రకంపనలు
- సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ

హైదరాబాద్, నవంబర్ 24 (నమస్తేతెలంగాణ) : రాజకీయ, ఆర్థిక అవినీతికి అదానీ స్కాం పరాకాష్ట అని, దీనిపై సమగ్ర విచారణ జరిపి అదానీని, ఇందుకు బాధ్యులను కఠినంగా శిక్షించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ డిమాండ్ చేశారు. అదానీ ముడుపుల వ్యవహారం ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నదని, ప్రధాని మోదీకి అదానీ, ఏపీ మాజీ సీఎం జగన్ అనుకూలంగా ఉన్నారని తెలిపారు. రూ.1,750 కోట్ల ముడుపులు ఇచ్చి రూ.లక్ష కోట్ల భారాన్ని ప్రజలపై మోపేందుకు గత ప్రభుత్వం ఒప్పందాలు చేసుకున్నదని విమర్శించారు. అమెరికా పర్యటనలో ఉన్న నారాయణ ఈ మేరకు ఆదివారం వీడియో విడుదల చేశారు. అమెరికాలోని న్యూయార్క్ కోర్టులో భారత దేశ కార్పొరేట్ దిగ్గజమైన అదానీపై లంచం కేసు నమోదయిందని, మన దేశంలా కాకుండా అక్కడ జాప్యం లేకుండా ఆర్థిక నేరాల కేసులను త్వరగా పరిష్కరిస్తారని వివరించారు. మోదీకి అదానీ కుడి భుజం లాంటివాడని, ఈ కేసును అమెరికా గవర్నమెంట్ సీరియస్‌గా తీసుకుంటుందా? లేదా? అదానికి మద్దతుగా మోదీ అడ్డం పడుతారా? అనేది వేచి చూడాల్సిందేనని చెప్పారు. అదానీపై చర్య తీసుకుంటే అమెరికా నిజాయితీ నిలబడుతుందని, ఈ కేసుకు మోదీ అడ్డుపడకుండా ఉంటే ఆయనకు స్వచ్ఛత వస్తుందని పేర్కొన్నారు. అమెరికా ప్రభుత్వం, మోదీ కుమ్మక్కై ఈ అవినీతి కేసును రూపుమాపాలని ప్రయత్నించడం సరికాదని హితవుపలికారు. కేసు సత్వర పరిష్కారానికి పెద్దఎత్తున ప్రజా ఉద్యమం రావాలని అభిప్రాయపడ్డారు. అమెరికా నుంచి ఆంధ్రప్రదేశ్‌కు అవినీతి లింకు అంటే ఆశ్చర్యంగా ఉన్నదని చెప్పారు. రూ.1,750 కోట్ల అవినీతికి ఆంధ్రప్రదేశ్ ప్రజలు లక్ష కోట్ల మూల్యం చెల్లించాలా? అని ప్రశ్నించారు.

ఏడాదైనా అభివృద్ధి శూన్యం!

- పల్లెలు, పట్టణాల్లో నిలిచిన అభివృద్ధి
- నిధులు లేక మున్సిపాలిటీలు విలవిల
- పనులకు ముందుకురాని కాంట్రాక్టర్లు
- బిల్లులు క్లియర్ చేయాలని డిమాండ్
- చోద్యం చూస్తున్న కాంగ్రెస్ సర్కారు

హైదరాబాద్ మహానగరంలో గుంతలమయంగా ఉన్న రోడ్డు

హైదరాబాద్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో వచ్చి ఏడాది కావొస్తున్నది. అద్భుతమైన పాలన అందించామంటూ సీఎం రేవంత్‌రెడ్డి సంబురాలకు సిద్ధమవుతున్నారు. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీల నుంచి గల్లీ లీడర్ల వరకు కాంగ్రెస్‌కు శ్రేణులంతా ఏడాది పాలనపై విజయోత్సవాలకు రెడీ అవుతున్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లకపోగా మరింత అధ్వానస్థితికి చేరింది. ఆడంబరాలతో కాలయాపన చేస్తూ అభివృద్ధిపై దృష్టి పెట్టని సీఎం రేవంత్‌రెడ్డి అప్పుల కుప్ప పోస్తూ రాష్ట్ర ఆస్తుల పెంపును నిర్లక్ష్యం చేస్తున్నారు. రాబడి పెంపుపై కనీస ప్రణాళికలు ఆచరణకు నోచుకోవడం లేదు.

ఏ పట్నం చూసినా ఏమున్నది!

రాష్ట్రంలో పల్లెలు, పట్టణాలు అనే తేడా లేదు. ఎక్కడ చూసినా ఏమున్నది గర్వకారణం అన్నట్టుగా మారింది.. పరిస్థితి. అభివృద్ధి జాడ లేదు, సంక్షేమం సంగతే సర్కారుకు యాదికి లేదు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి దూరదృష్టితో ప్రణాళికలు రచించడం సంగతి పక్కన పెడితే కనీస అవసరాలకు సంబంధించిన అభివృద్ధి పనులు కూడా జరగడం లేదు. రాష్ట్రంలో పట్టణాభివృద్ధి కుంటుపడింది. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని 143 పట్టణాల ప్రగతిని గాలికొదిలేసింది. జీహెచ్‌ఎంసీ, మున్సిపల్ కార్పొరేషన్లు, ఇతర మున్సిపాలిటీలలో అభివృద్ధి మచ్చుకు కూడా కనిపించడం లేదు. మున్సిపాలిటీలలో బీఆర్‌ఎస్ సర్కారు చేసిన అభివృద్దే తప్ప.. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకోదగిన పనులేమీ చేయలేదు. పట్టణాల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. అధికారులు సమావేశాలు, సమీక్షలతో కాలయాపన చేస్తున్నారు.

జడుసుకుంటున్న కాంట్రాక్టర్లు

జీహెచ్‌ఎంసీ, కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో అభివృద్ధి కోసం అధికారులు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్ల నుంచి స్పందన కరవైంది. పాత బిల్లుల సంగతి తేల్చితేనే కొత్తగా పనులు చేపట్టడంపై ఆలోచిస్తామని తేల్చిచెబుతున్నారు.కనీసం టెండర్లు కూడా వేయడం లేదంటే వారు ఎంత ఆగ్రహంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. బిల్లుల కోసం పాత కాంట్రాక్టర్లు పడుతున్న తిప్పలు చూస్తున్న కొత్త కాంట్రాక్టర్లు పారిపోతున్నారు. గ్రామాల్లో పరిస్థితి కూడా పట్టణాల్లో లాగానే ఉంది. అక్కడ కూడా పనులు ముందుకు సాగడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం పల్లెలు, పట్టణాలపై ఇదే నిర్లక్ష్యం కొనసాగిస్తే ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికావడం తప్పదని పౌరసంఘాల నేతలు హెచ్చరిస్తున్నారు.

బండ్లగూడ పోలీస్‌స్టేషన్‌లో తాజా మాజీ సర్పంచ్‌లు

మాజీ సర్పంచుల ఆందోళన అణచివేత

- నిరసన గళంపై ఉక్కుపాదం
- మహా అంబేద్కర్ విగ్రహం వద్ద పలువురి అరెస్ట్
- బలవంతంగా వ్యాన్‌లో తరలింపు
- అక్రమ అరెస్టులే ప్రజాపాలనా?: యాదయ్యగౌడ్ నిలదీత

హైదరాబాద్, నవంబర్ 24 (నమస్తేతెలంగాణ): తమ బిల్లుల బకాయిలు చెల్లించాలని నిరసనకు దిగుతున్న తాజామాజీ సర్పంచులపై రేవంత్‌రెడ్డి సర్కారు జులుం ప్రదర్శిస్తున్నది. న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని అడితే అణచివేత చర్యలకు దిగుతున్నది. సర్పంచుల సంఘం రాష్ట్ర జేఏసీ ఈ నెల 4న 'చలో హైదరాబాద్' పేరిట చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని అడుగడునా అడ్డుకున్నది. రాష్ట్రంలోని వివిధ గ్రామాల నుంచి తరలివస్తున్న మాజీ సర్పంచులను ఎక్కడికక్కడే నిర్బంధించింది. తాజాగా ఆదివారం ఉదయం హైదరాబాద్‌లోని మహా అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపేందుకు యత్నించిన జేఏసీ రాష్ట్ర నాయకులను అడ్డుకున్నది. పోలీసులు వారిని చుట్టుముట్టి బలవంతంగా అరెస్ట్ చేసి బలవంతంగా ఈడ్చుకెళ్లి వ్యాన్‌లో ఎక్కించి నాంపల్లి పోలీస్‌స్టేషన్ తరలించారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహం వద్ద మాజీ సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులను ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. కానీ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం రూ.750 కోట్లు ఇచ్చామని అబద్ధాలు చెప్తున్నారని మండిపడ్డారు. ఇదే విషయమై వాస్తవాలు వెల్లడించేందుకు ప్రెస్‌మీట్ పెట్టేందుకు కూడా అవకాశం ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అడిగితే అక్రమంగా అరెస్ట్ చేయడమే ప్రజాపాలనా? అని నిలదీశారు.

వస్త్ర పరిశ్రమపై నీలినీడలు

- చేనేతకు సీఎం మొండిచేయి
- వేములవాడ సభ ద్వారా తేటతెల్లం
- కార్మికులకు పనికల్పనలో వైఫల్యం
- ఉచిత చీరల పంపిణీపై అస్పష్టత
- వర్క్ ఆర్డర్లపైనా స్పష్టత కరువు

హైదరాబాద్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కారు తీరుతో రాష్ట్రంలో చేనేత పరిశ్రమపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఈ ఏడాది పాలనలో ఈ పరిశ్రమకు కోలుకోలేని దెబ్బపడింది. ఫలితంగా చేనేత, పవర్‌లూమ్ కార్మికులకు ఉపాధి కరువై, చేతి మగ్గాలు, మరమగ్గాలు మూలనపడ్డాయి. వేలాది కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన బతుకమ్మ చీరల పథకాన్ని రద్దు చేస్తూ.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వేలాది మంది కార్మికులకు ఆశనిపాతమైంది. వారికి ప్రత్యామ్నయం చూపించడంలోనూ ఈ సర్కారు విఫలమైంది. మహిళలకు రెండు చీరల చొప్పున ఉచితంగా ఇస్తామని, అందుకోసం 1.30 కోట్ల చీరలు తయారు చేయిస్తామని గొప్పలు చెప్పుకున్న కాంగ్రెస్ సర్కారు ఆదిలోనే మాట తప్పింది. వేములవాడ సభలో సీఎం రేవంత్‌రెడ్డి వస్త్ర పరిశ్రమ మనుగడపై ఎలాంటి హామీ ఇవ్వకపోవడంతో ఆశనిపాతమైంది. స్వయం స్వహాయక గ్రూపు మహిళలకు ఉచితంగా రెండు చీరల పంపిణీ కోసం నిర్ణయం తీసుకున్నామని చెప్పారే తప్పా.. వాటిని ఎప్పుడిస్తారు? ఎలా ఇస్తారు? 1.30 కోట్ల చీరల తయారీ బాధ్యతలు (వర్క్ ఆర్డర్లు) ఎవరికి ఇస్తారు? సూరత్ నుంచి తెప్పిస్తారా? లేక రాష్ట్రంలోని పవర్‌లూమ్ కార్మికులకు ఉపాధి కల్పిస్తారా? అన్న అంశాల పట్ల సీఎం నోరు మెదపనే లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 11 నెలల కాలంలోనే దాదాపు 15 మందికి పైగా వస్త్ర కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నట్టు లెక్కలే చెప్తున్నాయి. దీనికంతటికీ కాంగ్రెస్ సర్కారు అవలంబిస్తున్న వైఖరే కారణమని చేనేత సంఘాలు మండిపడుతున్నాయి. బీఆర్‌ఎస్ హయాంలో ప్రవేశ పెట్టిన అనేక పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నీరుగారుస్తున్నది. దానిలో భాగంగా చేయూత పథకాన్ని కూడా నిర్లక్ష్యం చేసింది. ఈ పథకాన్ని పునరుద్ధించాలని సీఎం రేవంత్‌రెడ్డిని వేడుకున్నా కార్మికులకు చేదు అనుభవమే మిగిలిందని తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్, ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేశ్ ఆవేదన వ్యక్తం చేశారు.

మరో రైతు ఆత్మహత్య

- దిగుబడులు లేక.. బోరు పడక
- అప్పులు తీర్చే మార్గం లేక
- మెదక్ జిల్లాలో రైతు బలవన్మరణం

కౌడిపల్లి, నవంబర్ 24: బోరు ఫెయిల్ కావడం, దిగుబడులు లేకపోవడంతో చేసిన అప్పులు భారమై ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం కంచనపల్లి గ్రామానికి చెందిన రైతు చంది షేకులు (49) వ్యవసాయం చేస్తున్నాడు. సాగు కోసం వేసిన బోరు ఫెయిల్ అయ్యింది. ఎకరం పొలంలో వరి వేసిన సరైన దిగుబడి రాలేదు. సాగు కోసం, కుటుంబ అవసరాల కోసం సుమారు రూ.5 లక్షల అప్పు అయ్యింది. వీటిని తీర్చే మార్గం లేక ఈ నెల 21న పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరబాద్‌లోని వివిధ దవాఖానలకు తరలించి వైద్యం చేయించారు. పరిస్థితి మరింత విషమించడంతో ఈనెల 22న గాంధీ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కౌడిపల్లి ఎస్సై రంజిత్‌రెడ్డి తెలిపారు.

పసికందు కిడ్నాప్ కథ సుఖాంతం

- నిలోఫర్ దవాఖానలో అపహరణ
- 6 గంటల్లో పోలీసుల ఛేదన
- గద్వాల జిల్లాలో చిన్నారి గుర్తింపు
- అదుపులో ముగ్గురు నిందితులు

అలంపూర్ చౌరస్తా, నవంబర్ 24 : హైదరాబాద్‌లోని నిలోఫర్ దవాఖానలో శనివారం పసికందు కిడ్నాప్ కాగా పోలీసులు రంగంలోకి దిగి ఆరు గంటల్లోనే శిశువును తల్లి ఒడికి చేర్చారు. ఈ ఘటనలో ముగ్గురిని అరెస్ట్ చేశారు. వివరాలు ఇలా.. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు చెందిన దంపతులు 45 రోజుల పసికందుకు పసిరికలు రావడంతో శనివారం హైదరాబాద్‌లోని నిలోఫర్ దవాఖానకు తీసుకొచ్చారు. పథకం ప్రకారం హసిన అనే మహిళ.. 'నేను దవాఖాన సిబ్బందిని, శిశువుకు వైద్య పరీక్షలు చేయించాలి' అని తల్లిదండ్రులను నమ్మించి బాలుడిని తీసుకెళ్లింది. ఎంతసేపటికి మహిళ రాకపోవడంతో తల్లిదండ్రులు దవాఖానలో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి.. కిడ్నాపర్లు కర్నూల్ వైపునకు వెళ్లారని సమాచారం తెలుసుకొని శనివారం రాత్రి జోగుళాంబ గద్వాల జిల్లా పోలీసులను అప్రమత్తం చేశారు. దీంతో హైదరాబాద్, ఉండవెల్లి, మానవపాడు, అలంపూర్ మండలాల పోలీసులు జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలంలోని పుల్లూరు టోల్‌గేట్ వద్ద గస్తీ నిర్వహించారు. వాహనాలను తనిఖీ చేయగా.. ఆదివారం తెల్లవారుజామున 3:30 గంటల ప్రాంతంలో ఓమ్నీ వ్యాన్‌లో బాలుడిని తరలిస్తుండగా పట్టుకున్నారు. వ్యాన్‌లో వెంకటేశ్వర్లు, హసీన, రేష్మ అనే ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని నాంపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిలోఫర్‌లో కిడ్నాప్ అయిన 45 రోజుల పసికందును తల్లిదండ్రులకు అప్పజెప్పినట్టు ఎస్సై మహేశ్ తెలిపారు.

పట్టా భూముల్లోంచి మంత్రి జూపల్లి రోడ్డు

మొదటిపేజీ తరువాయి...

వరుణ్ అధికార బలాన్ని ఉపయోగించుకొని తమ భూముల్లోంచి అక్రమంగా వారి భూమి వద్దకు రోడ్డు వేయించుకుంటున్నారని ఆరోపించారు. కొనసాగుతున్న రోడ్డు పనులను ఆదివారం అడ్డుకొని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బాధితులు, పట్టా భూముల యజమానులు కొండకళ్ల శ్రీకాంత్, కొండకళ్ల మణికాంత్ మాట్లాడుతున్న తమకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. అత్తాపూర్ సర్వే నంబర్ 94లో తమకు 2490.18 గజాల స్థలం ఉన్నదని, సర్వే నంబర్ 95లో హైదర్‌గూడకు చెందిన బండారు నారాయణకు సంబంధించిన స్థలం ఉన్నదని చెప్పారు. వీరి స్థలాలను దాటి మంత్రి జూపల్లి కృష్ణారావుకు సర్వే నంబర్ 55లో నాలుగెకరాల స్థలం ఉన్నదని వివరించారు. నారాయణ, మంత్రి కుమ్మక్కై తమ స్థలాన్ని కాజేసేందుకు కుట్రపన్నారని, తమను వేధింపులకు గురిచేయడమే కాకుండా 555 గజాల స్థలాన్ని జీహెచ్‌ఎంసీకి గిఫ్ట్ రూపంలో ఇచ్చేలా తమపై ఒత్తిడి చేశారని తెలిపారు. 2022లో తాము 555 గజాల స్థలాన్ని జీహెచ్‌ఎంసీకి గిఫ్ట్ రూపంలో ఇచ్చామని చెప్పారు. తర్వాత తమకు ఎలాంటి నష్టపరిహారం అందలేదని వాపోయారు. దస్తావేజులు సేకరించి అందులో తమకు జరిగిన మోసాన్ని గుర్తించామని చెప్పారు. సర్వే నంబర్ 95లోని నిర్మాణానికి 40 ఫీట్లు వదలాల్సి ఉన్నదని, వారు రోడ్డుకు స్థలం వదలకుండా తమ స్థలంలోని 20 ఫీట్లు వదులుతున్నట్టు

2017లో తమకు తెలియకుండా తామే రోడ్డుకు ఇస్తున్నట్టు జీహెచ్‌ఎంసీ నుంచి అనుమతులు తెచ్చుకున్నారని వివరించారు. ఎలాంటి సమాచారం లేకుండా తమ స్థలాన్ని ఎలా చూపిస్తారని బాధితులు ప్రశ్నించారు. మోసపోయామని గుర్తించి 2024 అక్టోబర్ 4న కోర్టులో కేసు వేశామని, డిసెంబర్ 9న కేసు హియరింగ్ ఉన్నదని చెప్పారు. దీంతో మంత్రి జూపల్లి తన పలుకుబడిని ఉపయోగించి ఫేక్ ఆర్డర్ తెచ్చి రోడ్డు పనులను ప్రారంభించారని, పోలీసులు, జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు దగ్గరుండి రోడ్డు పనులు చేయించడం విడ్డూరంగా ఉన్నదని వాపోయారు. స్థలం వద్దకు వెళ్లేందుకు కూడా తమకు పోలీసులు, అధికారులు అనుమతివ్వడం లేదని చెప్పారు. పేదల బస్తీల్లో రోడ్లు లేకున్నా ఏ ఒక్క అధికారీ స్పందించడు కానీ మంత్రి కృష్ణారావు స్థలానికి రోడ్డు వేసేందుకు మాత్రం అధికారుల యంత్రాంగం మొత్తం ఇక్కడే ఉన్నదని మండిపడ్డారు. తమకు జరుగుతున్న అన్యాయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎవరు పట్టించుకోవడం లేదని, తమకు న్యాయం జరిగే దాకా ఆందోళన చేస్తామని తెలిపారు.

డిపార్ట్‌మెంట్ హోదా కల్పించాలి

ప్రభుత్వానికి విత్తన ధ్రువీకరణ సంస్థ ఉద్యోగుల వినతి

హైదరాబాద్, నవంబర్ 24(నమస్తే తెలంగాణ): విత్తన ధ్రువీకరణ సంస్థకు డిపార్ట్‌మెంట్ స్టేటస్ కల్పించి వ్యవసాయ శాఖలో ప్రత్యేక విభాగంగా గుర్తించాలని ఆ సంస్థ ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. నగరంలోని ఓ హోటల్‌లో సంస్థ ఉద్యోగుల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర విత్తనరంగ అభివృద్ధిలో అధికారుల పాత్ర, ఉద్యోగుల సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. తమిళనాడు మాదిరిగా ఇక్కడ కూడా సీడ్ సర్టిఫికేషన్‌కు డిపార్ట్‌మెంట్ స్టేటస్ ఇవ్వాలని పేర్కొన్నారు. సంస్థ ఉద్యోగుల పెన్షన్‌ను రూ.30వేలకు పెంచాలని, కాంట్రాక్ట్ ఫీల్డ్ అసిస్టెంట్లను ఏఈవోలుగా పరిగణించి వేతనాలు పెంచాలని తీర్మానించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ విత్తన ధ్రువీకరణ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జనరల్ సెక్రటరీ పెబ్బేటి మహేశ్, అధ్యక్షుడు జయ ప్రకాశ్, అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ తిరుపతి పాల్గొన్నారు.

కుట్టుకూలికి 'కత్తెర'

- యూనిఫాం జతకు రూ.75 చెల్లిస్తామని హామీ
- రూ.50 మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్న ప్రభుత్వం
- రేవంత్ సర్కార్ వైఖరిపై స్వశక్తి మహిళల ఆగ్రహం
- నాలుగు నెలలుగా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు

హైదరాబాద్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ): నిధులలేమి సాకుతో యూనిఫాంలు కుట్టిన స్వశక్తి మహిళలకు కాంగ్రెస్ సర్కారు టోపీ పెట్టింది. జతకు రూ.75 చెల్లిస్తామని చెప్పి కేవలం రూ.50 మాత్రమే ముట్టజెప్పి కుట్టుకూలిలో కోత పెట్టింది. నాలుగు నెలలుగా అధికారుల చుట్టూ చక్కర్లు కొడుతున్నా పట్టించుకోకపోవడంతో మహిళల్లో అసహనం వ్యక్తమవుతున్నది. ప్రభుత్వ తీరుతో ఉపాధి మాట దేవుడెరుగు ఆర్థికంగా నష్టపోయామని ఆవేదన చెందడం కనిపిస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాలల పిల్లలకు ఉచితంగా అందించే యూనిఫాంలు కుట్టే బాధ్యతను రాష్ట్రంలోని మహిళా సంఘాలకు అప్పజెప్పింది. ఒక్కో జతకు రూ.50 చెల్లిస్తామని చెప్పింది. ఇందుకు స్వశక్తి మహిళలు ఒప్పుకోలేదు. ఈ డబ్బులు ముడిసరుకుకే సరిపోతాయని, మాకేం మిగులవని తేల్చిచెప్పారు. మార్చి 12న నిర్వహించిన మహిళాశక్తి సమ్మేళనంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. స్పందించిన ముఖ్యమంత్రి కేంద్రం సమగ్ర శిశు యోజన కింద ఒక్కో జతకు రూ.50 చెల్లిస్తుందని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.25 కలిపి మొత్తంగా రూ.75 చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. దీనికి జీవో కూడా జారీ చేయగా, మహిళా సంఘాల సభ్యులు ఉత్సాహంగా యూనిఫాంలు కుట్టే పనుల్లో నిమగ్నమయ్యారు. గడువులోగా 26,009 స్కూళ్లలోని 18,58,841 మంది పిల్లలకు ఒక్కో జత చొప్పున యూనిఫాంలు కుట్టి అందజేశారు.

రూ. 50 చొప్పునే చెల్లింపు

కానీ ఒక్కో జతకు రూ.50 చొప్పున.. సమగ్ర శిక్ష యోజన కింద కేంద్రం ఒక్కో యూనిఫాం జతకు విడుదల చేసిన రూ. 9,29,42,050 మాత్రమే చెల్లించింది. రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ. 4,64,71,025 నగదు విడుదల చేయలేదు. దీంతో నాలుగు నెలలుగా ఈ నగదు కోసం సమైక్య మహిళలు ఎదురుచూస్తున్నారు. అప్పటి నుంచి అధికారుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. పలుమార్లు మెప్మా, ఐకేపీ సీఈవోల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు.. అప్పుడంటూ దాటవేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కుట్టుకూలి బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ఆందోళనకు దిగేందుకు వెనుకాడబోమని హెచ్చరిస్తున్నారు.

డబ్బులొద్దు.. కమిట్‌మెంట్ ఇవ్వు?

- ఇంటికి వస్తానంటూ ఫోన్ చేస్తున్నారు
- హయత్‌నగర్ ఎస్సైపై మహిళ ఆరోపణ
- సివిల్ కేసు సాల్వ్ చేయనందుకే ఆరోపణ: సీఐ వివరణ
- రాచకొండ సీపీ దృష్టికి వెళ్లిన వివాదం?

హయత్‌నగర్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ హయత్‌నగర్ ఎస్సై సైదులు తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ ఓ మహిళ ఆరోపించారు. ఈ మేరకు రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబుకు ఫిర్యాదు చేసినట్టు ఆమె తెలిపారు. ఓ వీడియో కూడా మీడియాకు విడుదల చేశారు.

మహిళ చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని హయత్‌నగర్ పోలీసులు ఖండించారు. ఇంట్లోని నగదు, నగలు, కారును తన భర్త శ్రీకాంత్ తీసుకెళ్లిపోయారని హయత్‌నగర్ పోలీసులకు కొన్నిరోజుల క్రితం మహిళ ఫిర్యాదు చేశారు. ఆ కారు తమ తల్లి పేరు మీద ఉందని పేర్కొన్నారు. దీంతో పోలీసులు కారు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఆ మహిళ భర్త కర్నూల్‌లో ఉన్నట్టు గుర్తించిన పోలీసులు.. కారును రికవరీ చేసి మహిళకు అప్పగించారు. డబ్బులు కావాలా అని ఎస్సైని అడిగితే కమిట్‌మెంట్ కావాలని ఒత్తిడి చేశారని మహిళ ఆరోపిస్తున్నారు.

సివిల్ కేసు కాబట్టి కోర్టుకు వెళ్లాలని సూచించాం

ఫిర్యాదు చేసిన మహిళ ఓ న్యాయవాది. ఆమె భర్త శ్రీకాంత్‌తో గొడవలు జరిగాయి. శ్రీకాంత్ ఇంట్లో చెప్పకుండా కారులో వెళ్లిపోయాడు. మహిళ ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశాం. కారును తెప్పించి ఆమెకు అప్పగించాం. తన భర్త వద్ద ఉన్న బంగారం, నగలు ఇప్పించాలని ఎస్సై సైదులుపై మహిళ ఒత్తిడి చేశారు. అది సివిల్ కేసు కాబట్టి కోర్టులో తేల్చుకోవాలని ఎస్సై సూచించారు. తాను న్యాయవాదిని అని, తన కేసు పరిష్కరించాలని ఆమె ఒత్తిడి చేశారు. ఇప్పుడు ఎస్సైపై లైంగిక వేధింపుల పేరుతో తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. ఇప్పుడు సదరు మహిళ మరో ఫిర్యాదుతో వచ్చారు. తన భర్త, అతడి సోదరుడి లైంగిక వాంఛ తీర్చాలని ఒత్తిడి చేస్తున్నాడని, ఒప్పుకోకపోవడంతో ఇద్దరు కలసి తనపై దాడి చేసి, హత్యాయత్నం చేశారంటూ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశాం.

–నాగరాజు, హయత్‌నగర్ సీఐ

ఆర్టీసీలో 1201 డ్రైవర్ పోస్టులు

మాజీ సైనికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించిన సైనిక సంక్షేమ శాఖ

హైదరాబాద్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ సైనిక సంక్షేమ శాఖలో డ్రైవర్ పోస్టులకు మాజీ సైనికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. కాంట్రాక్ట్ ప్రాతిపదికన టీజీఎస్‌ఆర్టీసీలో 1201డ్రైవర్ పోస్టులకు సైనిక సంక్షేమ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఎంపికైన వారికి నెలకు రూ.26వేల వేతనం, రోజు వారీ అలవెన్స్ రూ.150 చెల్లిస్తారు. ఈ నెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని సైనిక సంక్షేమశాఖ సూచించింది. మాజీ సైనికుల్లో హెవీ డ్యూటీ లైసెన్స్ కలిగి, 18 నెలల డ్రైవింగ్ అనుభవం ఉన్న వారు దరఖాస్తులకు అర్హులు. వయస్సు 58 కన్నా తక్కువ ఉండాలి. ఎత్తు 160 సెం.మీ కంటే తక్కువ ఉండకూడదు. ఆసక్తి గల మాజీ సైనికులు దరఖాస్తును 30వ తేదీలోపు porsb-ts@ nic.in,emprsb-ts@nic.in కు మెయిల్ చేయాలని డైరెక్టర్ సైనిక్ వెల్ఫేర్ ప్లేస్మెంట్ ఆఫీసర్ తెలిపారు.

మహా కలవరం!

మొదటిపేజీ తరువాయి...

ఆందోళన వ్యక్తమవుతున్నది. అటు పార్టీ, ఇటు వారి భవిష్యత్తు ప్రశ్నార్థకమైందన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా నడుస్తున్నది. ఇటు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఏడాది కూడా పూర్తికాకముందే ప్రజావ్యతిరేకతను మూటకట్టుకోగా అటు జాతీయ స్థాయిలో ప్రజాభిమానాన్ని చూరగొనడంలో పార్టీ విఫలమయిందనే అభిప్రాయాలు కాంగ్రెస్ వర్గాల్లోనే వినిపిస్తున్నాయి. మహారాష్ట్రలో ఇంతటి ఘోర పరాజయాన్ని ఊహించలేదని పార్టీ నేతలే చెప్తున్నారు. 101 సీట్లలో పోటీ చేసిన కాంగ్రెస్ పార్టీ కేవలం 16 స్థానాల్లోనే గెలిచింది. ఒక జాతీయ పార్టీ ఇంత ఘోర పరాజయం మూటగట్టుకోవడంపై రాజకీయ విశ్లేషకులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఆ పార్టీపై ప్రజావ్యతిరేకత ఎంత ఉన్నదో ఈ ఫలితాలే స్పష్టంచేస్తున్నాయని అభిప్రాయపడుతున్నారు. కాంగ్రెస్‌ను దశాబ్దం నుంచి వరుస ఓటములు వెక్కిరిస్తూనే ఉన్నాయి. ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో కొంత పుంజుకున్నట్టు కనిపించినా ఆ తర్వాత డీలా పడిపోయింది. ఇటీవల జరిగిన పలు రాష్ట్రాల ఎన్నికల్లోనూ పార్టీ ఓటమిని మూటగట్టుకున్నది. హర్యానా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ తాజాగా మహారాష్ట్రలో భంగపాటే ఎదురైంది. ప్రస్తుతం కాంగ్రెస్ దేశంలోని కేవలం మూడు రాష్ట్రాల్లోనే అధికారంలో ఉండడం గమనార్హం.

గ్యారెంటీల విఫలంపై అంతర్మథనం

మహారాష్ట్ర ఎన్నికల్లో 'తెలంగాణ ఆరు గ్యారెంటీల' మంత్రం పని చేయకపోవడంతో ఇక్కడి నేతల్లో అంతర్మథనం మొదలైందనే చర్చ జరుగుతున్నది. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రివర్గమంతా మహారాష్ట్రలో ప్రచారం చేసి ఆరు గ్యారెంటీల గురించి కోడై కూసినా అక్కడి ప్రజలు పట్టించుకోలేదు. తెలంగాణలో అధికారంలోకి వచ్చాక 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఏడాది అవుతున్నా వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేక ప్రజల్లో నమ్మకం కోల్పోయింది. ఇలాంటి పరిస్థితుల్లో రాబోయే రోజుల్లో రాష్ట్రంలో జరగబోయే ఎన్నికలను ఎదుర్కోవడం కష్టమేననే భావన కాంగ్రెస్ కీలక నేతల్లో వ్యక్తమైనట్టుగా తెలిసింది. త్వరలోనే ఎమ్మెల్సీ, పంచాయతీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నది. ముఖ్యంగా పంచాయతీ ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఆందోళనగా ఉన్నట్టు తెలిసింది.